




ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 164 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 +https:www.prajarepublic.com + వెల - 1/-
ఆదివారం 19 జనవరి 2025

RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

## కుంభమేళా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక: ప్రధాని మోదీ

**మన్కి బాత్ 118వ కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.**

జనవరి 19, (రిపబ్లిక్ న్యూస్): ప్రయాగ్లో జరుగుతున్న మహాకుంభ మేళా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం అన్ని ప్రాంతాల, వర్గాల ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకువచ్చిందన్నారు. ప్రపంచ దేశాల ప్రజలు ప్రయాగ్రాజ్కు వచ్చి పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారని తెలిపారు. కుంభమేళాకు పెద్ద సంఖ్యలో వస్తున్న యువతను అభినందించారు. దేశంలోని యువత తమ ఆచార సంప్రదాయాలను తెలుసుకున్నప్పుడే మన మూలాలు బలపడతాయన్నారు.



ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ప్రపంచ దేశాల నుంచి వస్తున్న ఆదరణ ప్రతి భారతీయుడికి గర్వకారణమని చెప్పారు. మనసులో మాట పేరుతో ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే 'మన్కి బాత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగిస్తారు. అయితే.. ఈ నెలలో చివరి ఆదివారం అయిన జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకలు ఉండడం వల్ల నేడు(మూడో ఆదివారం) మన్కి బాత్ 118వ ఎపిసోడ్ ప్రసారం చేశారు. "ఈ రిపబ్లిక్ డే చాలా ప్రత్యేకమైనది. ఈ సంవత్సరం భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతుంది. మన పవిత్రమైన రాజ్యాంగాన్ని మనకు అందించిన రాజ్యాంగ పరిషత్లోని గొప్ప వ్యక్తులందరికీ తలవంచి నమస్కరిస్తున్నాను" అని అన్నారు.

### ఎన్నికల ప్రక్రియను ఈసీ పటిష్ఠం చేస్తోంది

ఎన్నికల సంఘం ఎన్నికల ప్రక్రియను ఎప్పటికప్పుడు ఆధునీకరించి, పటిష్ఠం చేస్తోందని ప్రధాని కొనియాడారు. ప్రజాశక్తిని బలోపేతం చేయడానికి సాంకేతికతను ఉపయోగిస్తూ.. నిష్పక్షపాతంగా పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తుందన్నారు. యువత అంకుర సంస్థల వైపు ఆకర్షితులవుతున్నారని ప్రధాని పేర్కొన్నారు. దీంతో స్టార్టప్ ఇండియా రూపుదిద్దుకుంటోందని.. సమాజంలో పరిస్థితులు మారిపోతున్నాయని అన్నారు. దేశం డిజిటల్ యుగంలోకి ప్రవేశిస్తోందని.. దేశాభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని వెల్లడించారు. నేటి యువత తమ అభివృద్ధి గురించి మాత్రమే కాకుండా సమాజ అభివృద్ధికి కూడా కృషి చేస్తోందని వెల్లడించారు. దీపక్ నబం అనే వ్యక్తి తాను స్థాపించిన అంకుర సంస్థ ద్వారా నిరాశ్రయులకు సహాయం చేస్తున్నాడని ప్రశంసించారు.

## ఆ విధ్వంసం గురించి చింతించొద్దు.. మూడింతల ప్రగతి సాధిస్తాం: అమిత్

గన్నవరం, జనవరి 19, (రిపబ్లిక్ న్యూస్): విపత్తుల వేళ ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని చూస్తే ప్రజలు నిశ్చింతగా ఉంటారని కేంద్ర హెూంమంత్రి అమిత్ అన్నారు. ఎన్డీఆర్ఎఫ్ సేవలను ఇతర దేశాల నేతలూ ప్రశంసించారని గుర్తుచేశారు. విజయవాడ సమీపంలోని కొండపావులూరులో నిర్వహించిన ఎన్డీఆర్ఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో అమిత్ మాట్లాడారు.

**విపత్తుల వేళ ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని చూస్తే ప్రజలు నిశ్చింతగా ఉంటారని కేంద్ర హెూంమంత్రి అమిత్ అన్నారు.**



"ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి అనూహ్య విజయం అందించిన అందరికీ ధన్యవాదాలు. వైకాపా ప్రభుత్వం రాష్ట్రాన్ని ఏవిధంగా ధ్వంసం చేసిందో అందరికీ తెలిసిందే. అప్పుడు జరిగిన విధ్వంసం గురించి చింతించకండి. ఏపీ అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబుకు ప్రధాని మోదీ అండదండలు ఉన్నాయి. మోదీ, చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో మూడింతల ప్రగతి సాధిస్తాం ఆరు నెలల్లో ఏపీకి రూ.3లక్షల కోట్ల విలువైన సహకారం అందించాం. విశాఖ ఉక్కుకు రూ.11,440 కోట్లు ప్రకటించాం. ఆంధ్రుల ఆత్మగౌరవంతో ముడిపడిన విశాఖ స్టీల్ప్లాంట్ను ముందుకు తీసుకెళ్తాం. గత ప్రభుత్వం రాజధాని అమరావతిని బుట్టదాఖలు చేసింది. హడ్కో ద్వారా అమరావతికి రూ.27వేల కోట్ల సాయం అందిస్తున్నాం. ఏపీకి జీవనాడి అయిన పోలవరంపై సీఎం చంద్రబాబుతో చర్చించాను. 2028లోపు ఏపీ మొత్తం పోలవరం ద్వారా నీళ్లు పారిస్తాం. విశాఖ రైల్వేజోన్ను కూడా పట్టాలెక్కించాం." అని అమిత్ షా అన్నారు.

## రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు..

**లోక్సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై గువాహటి పోలీస్ స్టేషనలో కేసు నమోదైంది.**

జనవరి 19, (రిపబ్లిక్ న్యూస్): దేశంతోనూ కాంగ్రెస్ పోరాడుతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో ఆయనపై అస్సాంలోని గువాహటి పోలీస్ స్టేషన్ ఎఫ్ఐఆర్ నమోదైంది. మోన్జిత్ చాటియా అనే వ్యక్తి ఈ ఫిర్యాదు చేశారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు వాక్ స్వాతంత్ర్య పరిమితులను దాటాయని, అవి జాతీయ భద్రతకు తీవ్రమైన ముప్పు కలిగిస్తాయని చాటియా తన ఫిర్యాదులో పేర్కొన్నారు.



ఆయన వ్యాఖ్యలు అశాంతితో పాటు, వేర్పాటువాద భావాలు కలిగిన వారిని రెచ్చగొట్టే ప్రమాదం ఉందన్నారు. 'ప్రతిపక్ష నాయకుడిగా.. ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజలకు విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత రాహుల్కు ఉంది. కానీ, ఆయన అందుకు బదులుగా అబద్ధాలు వ్యాప్తి చేసి దేశ ఐక్యతను, సార్వభౌమత్వాన్ని ప్రమాదంలో పడేస్తున్నారు' అని చాటియా ఆరోపించారు. దిల్లీలో కాంగ్రెస్ నూతన ప్రధాన కార్యాలయాన్ని ఇటీవల ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. 'ఆరెస్సెస్ వంటి మా భావజాలం వేల సంవత్సరాల నాటిది. భాజపా, ఆరెస్సెస్ దేశంలోని ప్రతి సంస్థను తమ గుప్పిట్లో పెట్టుకున్నాయి. మేము ఇప్పుడు భాజపా, ఆరెస్సెస్తోపాటు భారత దేశంపై కూడా పోరాడుతున్నాం' అని వ్యాఖ్యానించారు. ఈవ్యాఖ్యలను పలువురు కేంద్ర మంత్రులు తప్పుబట్టారు. కాంగ్రెస్ అసలురూపం ఈ వ్యాఖ్యలతో బయటపడిందని భాజపా జాతీయాధ్యక్షుడు, కేంద్రమంత్రి జేపీ నడ్డా వ్యాఖ్యానించారు.

## హైదరాబాద్లో క్యాపిటల్ ల్యాండ్ రూ.450 కోట్ల పెట్టుబడి

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సింగపూర్ పర్యటన కొనసాగుతోంది.**




సింగపూర్, జనవరి 19, (రిపబ్లిక్ న్యూస్): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సింగపూర్ పర్యటన కొనసాగుతోంది. తాజాగా క్యాపిటల్ ల్యాండ్ ప్రతినిధులతో భేటీ అయ్యింది. హైదరాబాద్లో రూ.450 కోట్ల పెట్టుబడికి ఆ సంస్థ ముందుకొచ్చింది. నగరంలో లక్ష చదరపు అడుగుల మేర భారీ ఐటీ పార్కు నిర్మించనుంది.

ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులతో సీఎం బృందం ఎంవోయూ కుదుర్చుకుంది. తెలంగాణలో రూ.3,500 కోట్ల పెట్టుబడులకు ఎస్టీ టెలీమీడియా గ్లోబల్ డేటా సెంటర్ ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల సమీపంలోని మీరాఖాన్పేటలో అత్యాధునిక ఏఐ ఆధారిత డేటా సెంటర్ క్యాంపస్ను స్థాపించేందుకు ఈ కంపెనీ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) చేసుకుంది.

## ప్రయాగ్రాజ్లోని మహాకుంభమేళాలో అగ్నిప్రమాదం

**ప్రయాగ్రాజ్లో జరుగుతున్న మహాకుంభమేళాలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది.**

ప్రయాగ్రాజ్, జనవరి 19, (రిపబ్లిక్ న్యూస్): ఉత్తరప్రదేశ్లోని ప్రయాగ్రాజ్లో జరుగుతున్న మహా కుంభమేళాలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ గుడారంలో రెండు గ్యాస్ సిలిండర్లు పేలడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. అక్కడి నుంచి క్రమంగా మంటలు ఇతర గుడారాలకు వ్యాపించాయని తెలిపారు. మరోవైపు, దట్టమైన పొగ వ్యాపించడంతో భక్తులు భయంతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్లతో ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. "మహా కుంభమేళాలోని సెక్టార్ 19 వద్ద గుడారంలో రెండు గ్యాస్ సిలిండర్లు పేలాయి. ఆ మంటలు ఇతర గుడారాలకు వ్యాపించాయి. కుంభమేళా వద్ద భద్రతా ఏర్పాట్లలో భాగంగా అప్పటికే ఉంచిన అగ్నిమాపక వాహనాలు ఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేశాయి. సమీపంలోని టెంట్లలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాం' అని పోలీసులు తెలిపారు.



"గీతా ప్రెస్కు చెందిన టెంట్లలో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేదు. నష్టాన్ని అంచనా వేసేందుకు సర్వే జరుగుతోంది. మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్నిప్రమాదానికి కారణాలను తెలుసుకొనేందుకు దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉంది. టెంట్లు, కొన్ని వస్తువులు మాత్రం దగ్ధమయ్యాయి" – మహా కుంభమేళా డీఐజీ వైభవ్ కృష్ణ

మరోవైపు, ఈ ఘటనపై మహా కుంభమేళా నిర్వాహకులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అగ్నిప్రమాద ఘటన ప్రతి ఒక్కరినీ దిగ్భ్రాంతికి గురిచేసిందని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టారని తెలిపారు. అందరూ సురక్షితంగా ఉండాలని గంగా మాతను ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఆదిలాబాద్ జిల్లాలో ప్రమాదం.. 47 మంది యాత్రికులకు గాయాలు

**ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం మాలేపూర్ ఘాట్లో యాత్రికులు ప్రయాణిస్తున్న వాహనం బోల్తాపడింది.**



ఎదులాపురం, జనవరి 19, (రిపబ్లిక్ న్యూస్): ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం మాలేపూర్ ఘాట్లో యాత్రికులు ప్రయాణిస్తున్న వాహనం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో 47 మంది యాత్రికులకు గాయాలయ్యాయి. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను 108, ప్రైవేటు వాహనాల్లో వాహనాల్లో రిమ్స్, నార్నూర్, ఉట్నూర్ ఆసుపత్రులకు తరలించారు. భక్తులు కెరమెరి మండలంలోని జంగుబాయి ఆలయానికి వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాద సమయంలో వాహనంలో మొత్తం 60 మంది భక్తులు ఉన్నారు. వీరిని గుడిహత్నూర్ మండలం సూర్యగూడ గ్రామ ఆదివాసీలుగా గుర్తించారు.

## నెల్లిమర్ల మిమ్స్ కళాశాలలో వైద్య విద్యార్థి ఆత్మహత్య





నెల్లిమర్ల, జనవరి 19, (రిపబ్లిక్ న్యూస్): విజయనగరం జిల్లా నెల్లిమర్ల మిమ్స్ వైద్య కళాశాల విద్యార్థి అటుకూరి సాయిమణిదీప్(24) బలవన్మరణానికి పాల్పడ్డాడు. వసతిగృహంలోని తన గది తలుపులు తీయకపోవడంతో తోటి విద్యార్థులు తలుపులను తెరిచి చూసేసరికి సాయిమణిదీప్ అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే మిమ్స్ యాజమాన్యానికి సమాచారం అందించారు. అనంతరం పోలీసుకులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. సాయిమణిదీప్ రెండో ఏడాది ఎంబీబీఎస్ పరీక్ష తప్పడంతో మానసికంగా ఆందోళనకు గురైనట్లు ఎస్ఐ తెలిపారు. తోటి విద్యార్థులంతా చదువు పూర్తి చేసి వెళ్లిపోతారని, తీవ్ర మనస్తాపానికి గురైన విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. మృతదేహాన్ని జిల్లాకేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విద్యార్థి స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలు.


printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



# వరుణ్ తేజ్ బర్త్.. ఆ దర్శకుడితో కొత్త ప్రాజెక్ట్

వరుణ్ తేజ్ పుట్టినరోజు నేడు. ఈ సందర్భంగా తదుపరి సినిమా అనౌన్స్మెంట్ వచ్చింది.



సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న నటుడు వరుణ్ తేజ్ భిన్నమైన కాన్సెప్ట్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. దర్శకుడు మేర్లపాక గాంధీతో కొత్త సినిమాకు సంతకం చేశారు. ఆదివారం వరుణ్ తేజ్ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఈ ప్రాజెక్ట్ వివరాలను ప్రకటించింది. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్స్ సంయుక్తంగా దీనిని నిర్మిస్తున్నాయి. 'ఇండో - కొరియన్ హారర్ కామెడీ ఫిల్మ్'గా ఇది రూపుదిద్దుకోనుంది. తమన్ స్వరాలు అందించనున్నారు. వరుణ్ తేజ్ 15వ చిత్రంగా తెరకెక్కనుంది. 'ఎక్స్ప్రెస్ రాజా', 'వెంకటాద్రి ఎక్స్ప్రెస్', 'ఏక్ మినీ కథ' వంటి చిత్రాలను మేర్లపాక గాంధీ తెరకెక్కించిన విషయం తెలిసిందే.

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- యోగివేమన జయంతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వేడుకగా ప్రతి సంవత్సరం అధికారికంగా నిర్వహిస్తుంది. (చిత్రంలో)
- 1736: శాస్త్రవేత్త, ఆవిరి యంత్రంతో ప్రాముఖ్యత పొందిన జేమ్స్ వాట్ జననం (మ.1819).
- 1905: భారత తత్వవేత్త దేవేంద్రనాథ్ ఠాగూర్ మరణం (జ.1817).
- 1918: తెలుగు పండితుడు, రచయిత, వక్త, విమర్శకుడు వావిలాల సోమయాజులు జననం (మ.1992).
- 1920: ఐక్యరాజ్య సమితి మాజీ ప్రధాన కార్యదర్శి జేవియర్ పెరేజ్ డిక్యుల్లర్ జననం (మ.2020).
- 1946: అమెరికా గాయని, పాటల రచయిత, బహుళ పరికరాల వాద్యకారిణి, నటి, దాత డాలీ పార్టన్ జననం.
- 1972: భారత క్రీడాకారుడు వినోద్ కంబ్లీ జననం.
- 1990: భారతీయ ఆధ్యాత్మిక బోధకుడు ఓషో మరణం (జ.1931).


యోగివేమన


జేమ్స్ వాట్



దేవేంద్రనాథ్ ఠాగూర్


వావిలాల సోమయాజులు


జేవియర్ పెరేజ్ డిక్యుల్లర్


డాలీ పార్టన్



వినోద్ కంబ్లీ


ఓషో

# సైఫ్ పై దాడి.. ఏఐ ఫొటో షేర్ చేసి విమర్శలు ఎదుర్కొన్న ఎంపీ

బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ పై దాడికి విచారం వ్యక్తం చేస్తూ సీనియర్ నటుడు, ఎంపీ షేర్ చేసిన ఫొటో ప్రస్తుతం నెట్టింట వైరల్ అయింది. ఆయన తీరును నెటిజన్లు తప్పుపడుతున్నారు.





బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ పై దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై పలువురు సెలబ్రిటీలు ఇప్పటికే విచారం వ్యక్తం చేశారు. తాజాగా సీనియర్ నటుడు, ఎంపీ శత్రుఘ్న సిన్హా ఈ దాడి గురించి స్పందించారు. ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టి విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఆయన షేర్ చేసిన ఫొటోనే ఇందుకు కారణం. "నాకెంతో ఇష్టమైన వ్యక్తి, అప్పుడు సైఫ్ అలీఖాన్పై దాడి జరగడం దురదృష్టకరం. ఆయన కోలుకుంటున్నందుకు భగవంతుడికి కృతజ్ఞతలు. ఈ ఘటనపై వెంటనే స్పందించిన ప్రభుత్వం, పోలీసులకు ధన్యవాదాలు. పరిస్థితులు త్వరితగతిన చక్కబడతాయి" అని ఆయన పేర్కొన్నారు. సైఫ్, ఆయన సతీమణి కరీనాకు సంబంధించి ఏఐ జనరేటెడ్ ఫొటోని షేర్ చేశారు. ఇందులో సైఫ్ బెడ్పై ఉండగా.. కరీనా ఆయన పక్కనే కూర్చొని ఉన్నారు. వీరిద్దరూ నవ్వుతూ ఫొటోకు పోజులిస్తున్నట్లు కనిపించారు. దీనిని చూసిన పలువురు నెటిజన్లు శత్రుఘ్న సిన్హాపై విమర్శలు కురిపిస్తున్నారు. ఏఐ ఫొటో షేర్ చేయాల్సిన అవసరం ఏముంది? అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ఆ కుటుంబం ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ఇలాంటి ఫొటోలు పంచుకోవడం సరైన పద్ధతి కాదని హితవు పలుకుతున్నారు. బాంద్రాలోని సైఫ్ నివాసంలో గురువారం (జనవరి 16) తెల్లవారుజామున 2.30 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. దుండగుడిని చూసిన జేహ్ కేర్టేకర్ కేకలు వేయగా సైఫ్ అక్కడికి చేరుకొన్న సమయంలో పెనుగులాట జరిగింది. ఈక్రమంలో సైఫ్ గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన లీలావతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనను సీరియస్గా తీసుకున్న ముంబయి పోలీసులు కేసు నమోదు చేసుకుని దాదాపు 20 బృందాలుగా ఏర్పడి మూడు రోజులపాటు గాలించి నిందితుడిని శనివారం అరెస్ట్ చేశారు. దొంగతనం చేయాలనే ఉద్దేశంతోనే నిందితుడు సైఫ్ ఇంట్లోకి వెళ్లాడని తాజాగా డీసీపీ వెల్లడించారు. "ప్రాథమిక విచారణలో అతడిని బంగ్లాదేశీయుడిగా గుర్తించాం. నిందితుడు అక్రమంగా భారత్లోకి ప్రవేశించాడు. భారత్ వచ్చాక విజయ్ దాస్ గా పేరు మార్చుకున్నాడు" అని ఆదివారం ప్రెస్మీట్లో చెప్పారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

# అందంవివాదాస్పద సీన్.. స్పందించిన నటి

'శంభో శివ శంభో'తో తెలుగు వారికి చేరువైన నటి అభినయ. ఆమె ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'పని'. ఇందులో వివాదాస్పదమైన ఓ సన్నివేశంపై ఆమె స్పందించారు.



'శంభో శివ శంభో'తో తెలుగు వారికి చేరువైన నటి అభినయ. ఆమె ప్రధాన పాత్రలో నటించిన తాజా మలయాళ చిత్రం 'పని'. నటుడు జోజూ జార్జ్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ప్రస్తుతం ఓటీటీ వేదికగా అందుబాటులో ఉంది. ఇందులో హీరోయిన్పై చిత్రీకరించిన అత్యాచార సన్నివేశం వివాదాస్పదమైన విషయం తెలిసిందే. జోజూ జార్జ్ మేకింగ్ను పలువురు తప్పుపట్టారు. దీనిపై తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో అభినయ స్పందించారు. దివ్యాంగురాలైన ఆమె.. సైన్ లాంగ్వేజ్తో తన అభిప్రాయాన్ని తెలిపారు. "తన సినిమాలో ఎలాంటి సన్నివేశాలు పెట్టాలి? ఎలా తెరకెక్కించాలి? అనేది పూర్తిగా దర్శకుడి నిర్ణయం. కాబట్టి దాని గురించి నేను పెద్దగా ఏమీ మాట్లాడాలనుకోవడం లేదు. ఏది ఏమైనా దర్శకుడి మాటే తుది నిర్ణయం. జోజూ గొప్ప నటుడు. ఎన్నో భాషల్లో, ఎంతోమంది పేరు పొందిన దర్శకులతో వర్క్ చేసిన అనుభవం ఆయన సొంతం" అని అభినయ తెలిపారు. మిగిలిన భాషలతో పోలిస్తే మలయాళంలో యాక్ట్ చేయడం కాస్త భిన్నమైన అనుభూతిని అందించిందని ఆమె చెప్పారు. చిత్రీకరణ సమయంలో జోజూ తనకు ఎంతో సాయం చేశారన్నారు. "యాక్టింగ్ గురించి ఆయన సలహాలు ఇచ్చేవారు. ఆయనతో పని చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా ఈ సినిమాతో అది నెరవేరింది. మలయాళ నటుడు టొవినో థామస్ నటన నాకెంతో ఇష్టం. ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవాలని ఉంది. దర్శకుల విషయానికి వస్తే రాజమౌళి అంటే అభిమానం. ఆయన సినిమాలో ఒక్కసారైనా నటించాలని అనుకుంటున్నా" అని చెప్పారు. తాను ఈ స్థాయికి చేరడానికి కుటుంబ సభ్యులే కారణమని అభినయ ఇప్పటికే ఎన్నో సందర్భాల్లో చెప్పారు. తన కలను వారు అర్థం చేసుకున్నారని.. కథ ఎంపిక, చిత్రీకరణ ఇలా అన్ని విషయాల్లో అండగా నిలిచారని గతంలో తెలిపారీ భామ.

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# రోహిత్ మళ్లీ విశ్వరూపం చూపిస్తాడు.. సూర్యకుమార్ ఉంటే..: సురేశ్ రైనా

వచ్చే ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో టీమ్ ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ దంచికొడతాడని భారత మాజీ ఆటగాడు సురేశ్ రైనా ఆశాభావం వ్యక్తం చేశాడు.



టీమ్ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ వచ్చే ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో 2019 ప్రపంచ కప్ మాదిరిగా దంచికొడతాడని భారత మాజీ ఆటగాడు సురేశ్ రైనా ఆశాభావం వ్యక్తం చేశాడు. 2019 వరల్డ్ కప్లో రోహిత్ విశ్వరూపం ప్రదర్శించాడు. 9 ఇన్నింగ్స్ల్లో 81 సగటుతో 648 రన్స్ (ఐదు సెంచరీలు, ఒక అర్ధ సెంచరీ) చేసి టోర్నీలో టాప్ స్కోరర్గా నిలిచాడు. అయితే, ఇటీవల హిట్మ్యాన్ జోరు తగ్గింది. బ్యాటర్గా వరుస మ్యాచ్లో విఫలమవుతూ అభిమానులను నిరాశపరుస్తున్నాడు. బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సిరీస్లో చివరి టెస్టుకు స్వయంగా జట్టు నుంచి వైదొలిగాడు. ఈ నేపథ్యంలోనే రోహిత్ తిరిగి పుంజుకుంటాడని సురేశ్ రైనా పేర్కొన్నాడు. "2011 ప్రపంచకప్ జట్టుకు ఎంపికకాకపోవడంతో రోహిత్ చాలా బాధపడ్డాడు. తర్వాత జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ 2013తో ఆ లోటును తీర్చుకున్నాడు. మేం చివరగా (2013) ఇంగ్లాండ్లో ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచాం. అయితే, ప్రస్తుతం దుబాయ్ వేదికగా భారత్ మ్యాచ్లు ఆడనుంది. అక్కడి పరిస్థితులు ఇంగ్లాండ్ కంటే పూర్తిగా భిన్నంగా ఉంటాయి. యూఏఈలో ఎలా ఆడాలో రోహిత్కు తెలుసు. ఒకవేళ అతను 20-25 ఓవర్ల వరకు ఆడితే 2019 వరల్డ్ కప్ ప్రదర్శన పునరావృతం చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు' అని రైనా పేర్కొన్నాడు.


### సూర్యకుమార్ ఉంటే..

ఛాంపియన్స్ ట్రోఫీ జట్టులో సూర్యకుమార్ యాదవ్కు చోటు దక్కకపోవడంపై రైనా స్పందించాడు. 'సూర్య ప్రపంచ కప్ జట్టులో అంతర్భాగంగా ఉన్నాడు. అతను గేమ్లో ఏ దశలోనైనా ఓవర్కు 9 పరుగుల చొప్పున స్కోర్ చేయగల సమర్థుడు. విభిన్నంగా బ్యాటింగ్ చేస్తూ ప్రత్యర్థిపై ఆధిపత్యం చెలాయించగలడు. ఒకవేళ సూర్య జట్టులో ఉంటే ఎక్స్ ఫ్యాక్టర్గా ఉండేవాడు. కానీ, ఫామ్లో లేని టాప్ 3 బ్యాటర్లపై ఇప్పుడు బాధ్యత ఉంటుంది. శుభ్మన్ గిల్ సరైన సమయంలో వైస్ కెప్టెన్సీ పగ్గాలు అందుకున్నాడు. అతను భారత క్రికెట్ భవిష్యత్ సూపర్ స్టార్. వన్డేల్లో ఇప్పటికే సత్తాచాటాడు. గిల్ను ఎలా ముందుకు నడిపించాలో రోహిత్కు తెలుసు' అని సురేశ్ రైనా వివరించాడు.

## అందం

# అన్వాంటెడ్ హెయిర్ని ఇంట్లోనే రిమూవ్ చేయాలనుకుంటున్నారా, ఇలా చేస్తే సరి

అన్వాంటెడ్ హెయిర్ కొందరికీ చాలా ఇబ్బందిగా అనిపిస్తుంది. అందుకే, దానిని ఎప్పటికప్పుడు తీసేస్తుంటారు. అయితే, దీనిని షేవ్ చేయడం నచ్చని వారు.. ఎలా అన్వాంటెడ్ హెయిర్ రిమూవ్ చేయాలా అని ఆలోచిస్తుంటారు. అలాంటివారు కొన్ని టిప్స్ ఫాలో అవ్వొచ్చు. అవేంటో తెలుసుకోండి.



బ్యూటీపై ఈ మధ్య ప్రతి ఒక్కరికీ ఇంట్రెస్ట్ పెరిగింది. దీంతో బాడీలో అణువణువు అందంగా కనిపించాలనుకుంటున్నారు. అందుకోసమే చర్మాన్ని కూడా అందంగా మెరిపించేందుకు, స్మూత్గా కనిపించేందుకు కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలనుకుంటున్నారు. అందుకోసమే చర్మంపై ఉన్న అన్వాంటెడ్ హెయిర్ని రిమూవ్ చేయించుకోవాలనుకుంటారు. దీనికి చాలా పద్ధతులు ఉన్నాయి. కొంతమంది షేవ్ చేస్తే మరికొంతమంది పార్లర్స్ వెంట పరుగులు పెడతారు. అయితే, డబ్బు ఖర్చు కాకుండా హెయిర్ని రిమూవ్ చేసుకోవాలనుకుంటే మాత్రం కొన్ని టిప్స్ ఫాలో అవ్వాల్సిందే. వీటి వల్ల హెయిర్ చక్కగా రిమూవ్ అవుతుంది.

### బొప్పాయి, అలోవెరా



ఇది కూడా అవాంఛిత రోమాల్ని చక్కగా బయటికి లాగుతుంది. దీనికోసం బొప్పాయి గుజ్జులో కొద్దిగా అలొవెరా జెల్ వేసి పేస్టులా చేయాలి. దీనిని స్కిన్పై రాసి మసాజ్ చేయాలి. 20 నుంచి 25 నిమిషాల తర్వాత నీటితో కడిగేయాలి. దీంతో చక్కగా అన్వాంటెడ్ హెయిర్ రిమూవ్ అవుతుంది.

### ఎగ్ వైట్ మాస్క్




ఎగ్ వైట్స్ని మంచిగా బీట్ చేయాలి. మొత్తం ఇది నురుగులా వచ్చేవరకూ బీట్ చేయాలి. దీనిని చర్మంపై రాసి టిష్యూ పేపర్ వేయాలి. మెల్లిగా ప్రెస్ చేయాలి. గుడ్డు మిశ్రమం ఆరిన తర్వాత దీనిని జుట్టు పెరగడానికి అపోజిట్ డైరెక్షన్లో లాగేయాలి.

### థ్రెడింగ్



ఇది చాలా మంది వాడే పద్ధతి. దీనికోసం థ్రెడ్ని తీసుకుని జుట్టు పెరగడానికి అపోజిట్ డైరెక్షన్లో గట్టిగా పట్టి లాగుతుంటారు. దీంతో అన్వాంటెడ్ హెయిర్ ఈజీగా వచ్చేస్తుంది. ఇది కాస్తా టైమ్ పడుతుంది. కానీ, హెయిర్ మాత్రం మొత్తం క్లీన్ అవుతుంది. ఎక్కువగా ఇదే టిప్ ఫాలో అవుతారు.

### వ్యాక్సింగ్



మార్కెట్లో మనకి వ్యాక్స్ దొరుకుతుంది. దానిని తీసుకొచ్చి కాస్తా గోరువెచ్చగా చేసి స్కిన్పై రాయాలి. తర్వాత దీనికి అపోజిట్ డైరెక్షన్లో పల్చని క్లాత్ లేదా వ్యాక్స్ స్ట్రిప్స్ అతికించి జుట్టు పెరగడానికి అపోజిట్ డైరెక్షన్లో లాగాలి. ఇలా వ్యాక్స్ చేస్తే చాలా వరకూ జుట్టు మొత్తం వచ్చేస్తుంది.

### షుగరింగ్



షుగరింగ్తో అన్వాంటెడ్ హెయిర్ ఈజీగా రిమూవ్ అవుతుంది. స్కిన్ కూడా స్మూత్గా మారుతుంది. దీనికోసం ఏం చేయాలంటే కొద్దిగా పంచదార, తేనె, నిమ్మరసం, నీరు కలిపి వేడి చేయాలి. పేస్టులా చేయాలి. దీనిని స్కిన్కి అప్లై చేయాలి. కాసేపు ఉన్న తర్వాత ఓ పల్చని క్లాత్ లేదా వ్యాక్స్ స్ట్రిప్స్ని అతికించి జుట్టు పెరగడానికి అపోజిట్ డైరెక్షన్లో లాగాలి.

### అరటిపండులో ఓట్స్



అరటిపండు గుజ్జుని మెత్తగా చేయాలి. ఇందులో ఓట్స్ వేయాలి. దీనిని ఫేషియల్ హెయిర్పై అప్లై చేయాలి. ఆరిన తర్వాత క్లీన్ చేస్తే జుట్టు రాలడం తగ్గుతుంది.

గమనిక: నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.

